

కల్యాణం.. కమనీయం..

ధనుర్మాసం చివరిరోజైన ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల గోదారంగనాథుల కల్యాణవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరుడి ఆలయంలో స్వామివారి కల్యాణక్రతువును అంగరంగవైభవంగా నిర్వహించారు.





ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 32 కనిష్ఠం 22 | భద్రాద్రి : గరిష్ఠం 31 కనిష్ఠం 20
సోమవారం, 15 జనవరి 2024

కాలుదువ్విన కోళ్లు



- ఏపీ సరిహద్దుల్లో జోరుగా కోడిపందాలు
- బిర్రుల వద్ద భారీగా గ్యాంబ్లింగ్, తదితర జూదాలు
- భోగి రోజున చేతులుమారిన రూ.కోట్లు
- సంక్రాంతి నేపథ్యంలో భారీగా తరలిన తెలంగాణ జనం

అశ్వారావుపేట/ బూర్గంపాడు/ ఎర్రుపాలెం, జనవరి 14 : సంక్రాంతి వేళ తెలుగులోగిళ్లన్నీ రంగవల్లులు, పిల్లాపాపలు, పిండివంటలతో సందడిగా మారాయి. ఓ వైపు ఆదివారం భోగిపండుగ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచే భోగిమంటలతో అందరూ ఆడిపాడగా.. మరో వైపు పందెం రాయుళ్లు మాత్రం ఆడుదాం ఆంధ్రాలో అంటూ కోడిపందాల బిర్రుల్లో మోహరించారు. ఉమ్మడిఖమ్మం జిల్లాకు సరిహద్దుల్లోని తూర్పు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లాలోని పలు శివారు గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట సరిహద్దులోని ఏపీ గ్రామాలైన కామయ్యపాలెం, తాటాకులగూడెం, శ్రీనివాసపురం, పాలచెర్ల, జంగారెడ్డిగూడెం, దెందులూరు, తాడేపల్లిగూడెం, పేరంపేట, భీమవరం, కుకునూరు, వేలేరుపాడు, చింతలపూడి తదితర ప్రాంతాలతో పాటు ఏపీలో విలీనమైన వేలేరుపాడు, కుక్కునూరు, వరరామచంద్రాపురం, చింతూరు, కూనవరం, ఎన్టీఆర్ జిల్లాలోని ఊటుకూరు, నెమలికొణిజర్ల, మైలవరం, దెందులూరు, మురుసుమిల్లి, గంగినేని, వీరులపాడు, పెనుగొలను, రుద్రారం, పొందుగుల, రెడ్డిగూడెం గ్రామాల్లో కోడిపందాలు జోరుగా సాగుతున్నాయి.

రాష్ట్రంలో అనుమతిలేకపోవడంతో..

కోడిపందాలు లాంటి జూద క్రీడలకు తెలంగాణలో అనుమతి లేకపోవడంతో ఇక్కడి పందెంరాయుళ్లంతా పండగకు ముందే ప్రణాళికలు వేసుకొని మరీ ఏపీ బిర్రులకు తరలారు. ఈ క్రమంలో వేలకువేలు పోసి కోడిపుంజులకు కొనుగోలు చేసిన వారు కొందరైతే.. ఖరీదైన బలవర్ధక ఆహారం పెట్టి పెంచిన వారు కొందరుంటారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పొరుగున ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల నుంచి పందెంరాయుళ్లు భారీగా తరలారు. ఈ క్రమంలో కోడిపందాలతో పాటు పేకాట, లోనబయట, గుండాట లాంటి జూదాలు, మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతుండటంతో చాలామంది డబ్బులు పోగొట్టుకుంటున్నారని సమాచారం. ఈక్రమంలో భోగి పండుగ రోజున రూ.కోట్లలో డబ్బు చేతులు మారిందని, స్థావరాల వద్ద పందెం రాయుళ్లకు ఇబ్బంది కలగకుండా కొందరు మినీ ఏటీఏంలను కూడా ఏర్పాటు చేయడం గమనార్హం.

ఇరు రాష్ట్రాల సరిహద్దులో ట్రాఫిక్‌జాం

తెలంగాణ, సరిహద్దు ప్రాంతమైన ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం వేలేరు గ్రామంలో నిర్వహించిన కోడిపందాలకు వెళ్లే జనంతో తెలంగాణ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు ప్రధాన కూడలి నుంచి వేలేరు గ్రామం వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో గంటల తరబడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బూర్గంపాడు పోలీసులు వేలేరు వైపు వాహనాలను వెళ్లకుండా బూర్గంపాడు శివారులో నిలిపివేయడంతో కొంతమేరట్రాఫిక్‌ను నియంత్రించగలిగారు. ఇక అశ్వారావుపేట, సత్తుపల్లి, మధిర, ఎర్రుపాలెం తదితర ప్రాంతాల మీదుగా ఏపీవైపై వెళ్లే వాహనాలతో రహదారులు రద్దీగా కనిపించాయి.


ఏపీ సరిహద్దు కామయ్యపాలెంలో కోడి పందాలు వేస్తున్న దృశ్యం


ఎన్టీఆర్ జిల్లా నెమలికొణిజర్లలో బిర్రుల వద్ద భారీగా జనం


బూర్గంపాడు నుంచి పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం వేలేరు వెళ్లే రహదారిలో నిలిచిన వాహనాలు



సంబురాల సంక్రాంతి

- నేడు తెలుగువారి పెద్దపండుగ
- బంధుమిత్రులతో సందడిగా పల్లెలోగిళ్లు
- ఘనంగా భోగి వేడుకలు
- రేపు కనుమ


జూలూరుపాడులో భోగిమంటలు వేసిన దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 14: సూర్యుడు ధనస్సు నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తున్న వేళ తెలుగులోగిళ్లు సంక్రాంతి సంబురాలతో సందడిగా మారాయి. సంక్రాంతి వేడుకల్లో భాగంగా తొలిరోజు ఆదివారం ఉమ్మడి జిల్లా ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామున భోగిమంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. మహిళలు ఇళ్ల వాకిళ్లలో రంగవల్లులను అద్ది పూలు, గొబ్బెమ్మలతో అలంకరించారు. గంగిరెద్దుల విన్యాసాలు, పిల్లల పతంగుల ఆటలతో సందడి చేశారు. భోగి పర్వదినం, ధనుర్మాసం చివరి రోజుకావడంతో దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. గోదాదేవి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఇక తెలుగువారి ప్రధాన పండుగైన సంక్రాంతికి పల్లెలు సర్వం సిద్ధమయ్యాయి. మకర సంక్రాంతి సందర్భంగా శబరిమల తరహాలో జిల్లాలోని ఆలయాల్లోనూ అయ్యప్ప భక్తులకు జ్యోతి దర్శనమిచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే సంక్రాంతి మరుసటి రోజున జరుపుకొనే కనుమ రోజున రైతులు తమకు వ్యవసాయంలో చేదోడుగా ఉండే పశువులను పూజించడంతో పాటు పితృదేవతలకు పూజలు చేస్తారు. అయితే సంక్రాంతి అంటే ముందుగా గుర్తొచ్చే డూడూ బసవన్నలు, హరిదాసుల కీర్తనలు.. కానీ నేటితరానికి ఆ రెండూ దూరమవుతున్నాయి. పండుగ రోజు తీపి గుర్తులను మిగిల్చే బసవన్నల విన్యాసాలు నేటితరం పిల్లలు పాఠ్యపుస్తకాల్లోనే చదవాల్సి వస్తోందని పెద్దలు అభిప్రాయపడుతున్నారు.

మంత్రుల సంక్రాంతి శుభాకాంక్షలు

ఖమ్మం సంక్షేమవిభాగం : సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రజలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని, వ్యవసాయం, పశుసంపత్తి, ఆరోగ్యం, సంపద పెరగాలని, పాడి పంటలతో తులతూగాలని వారు ఆకాంక్షించారు. అలాగే మాజీమంత్రి పువ్వాడ అజయ్ కూడా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


కూసుమంచిలో గంగిరెద్దుకు పూజలు



సచివాలయ సలహాదారుగా ప్రసన్నకుమార్

సభాపతుల ప్రతిపాదనను ఆమోదించిన సీఎం

ఖమ్మం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సచివాలయ సలహాదారుగా ఖమ్మం నగరానికి చెందిన సూర్యదేవర ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ప్రసన్నకుమార్‌ను సలహాదారుగా ఎంపిక చేస్తూ శాసన మండలి, శాసనసభల స్పీకర్లు గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్ చేసిన ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఆమోదించి 12వతేదీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసన్న కుమార్ 30ఏళ్లపాటు కేంద్ర ప్రభుత్వంలో పలు హోదాల్లో విశిష్ట సేవలందించారు. అందులో 15 ఏళ్లకు పైగా అత్యున్నతమైన రాజ్యాంగ కార్యాలయాల్లో పని చేశారు. అందులోనూ ఐదేళ్లపాటు లోకసభ స్పీకరుకు ఓఎస్డీగా పనిచేశారు. చట్ట సభల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలన్న అప్పటి లోక్‌సభ స్పీకర్ లక్ష్యానికి అనుగుణంగా, పార్లమెంటులో మీడియాతో సమన్వయం చేస్తూ ప్రపంచంలోనే తొలిసారిగా పార్లమెంటు కోసం 'లోక్‌సభ టీవీ' పేరుతో స్పీకర్ నేతృత్వంలో టీవీ చానల్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఆయన స్వస్థలం ఖమ్మం నగరం కాగా ఇంటర్ వరకు ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి.. కర్నూలులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలో సైన్స్ పట్టా పొందారు. అనంతరం న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి పర్యావరణ శాస్త్రంలో ఎమ్మెస్సీ, ఎం ఫిల్ డిగ్రీలు, ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.





వైరాలో దట్టంగా అలుముకున్న పొగమంచు



కమ్మేసిన మంచు

భోగిరోజు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పొగమంచు దట్టంగా అలుముకుంది. ఉదయం 10గంటల వరకు తుంపర్లతో కూడిన మంచు బిందువుల్లా రాలాయి. రహదారిని మంచు కమ్మేయడంతో దూరప్రాంతాలనుంచి వచ్చే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూలూరుపాడు మండలంలో ఆదివారం తెల్లవారి 10గంటలు కావస్తున్నా.. మంచుతెరలు వీడిపోలేదు.

- వైరా, జూలూరుపాడు, కొత్తగూడెం



కొత్తగూడెంలో చలిమంట వేసుకున్న వాకర్లు



జూలూరుపాడును కమ్మేసిన మంచు

కన్నులపండువగా గోదాదేవి కల్యాణం

- ఉమ్మడి జిల్లాలో పలు ఆలయాల్లో వేడుకలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

భద్రాచలం/కూసుమంచి/నేలకొండపల్లి/ఖమ్మం ఖానాపురం హవేలి/ముదిగొండ, జనవరి 14: ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణం కన్నులపండువగా జరిగింది. కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథులస్వామి కల్యాణ్యాన్ని ఘనంగా నిర్వహించారు. పరిసరగ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. జీళ్లచెరువు ఆలయధర్మకర్తలమండలి ఛైర్మన్ బూర్లె వీరబాబు, వైస్‌ఛైర్మన్ రామాచారి, ఆశాకుమారి, ఆలయ ఈవో నారాయణాచార్యులు, అర్చకులు జనార్ధనాచార్యులు, సీతారామనుజాచార్యులు, అప్పలాచార్యులు గ్రామపెద్దలు బొడ్డు నరేందర్, అంజయ్య, రామదాసు పాల్గొన్నారు. అదేవిధంగా నాయకన్‌గూడెం గ్రామంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు. ప్రధానఅర్చకులు పరాశర సంపత్‌కుమార్ భట్టార్, శ్రీధర్ భట్టార్, సుందర్‌భట్టార్ తదితరులు కల్యాణ క్రతువు నిర్వహించారు.

భద్రాచలం: భద్రాద్రి రామాలయంలో గోదాదేవి కల్యాణం ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. నిత్యకల్యాణ మండప వేదికలో శ్రీరంగనాథుడు గోదాదేవిల కల్యాణం సంప్రదాయబద్ధంగా అర్చకస్వాములు నిర్వహించారు. తొలుత విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, యోక్తధారణ, కంకణధారణ, జీలకరబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వరుసగా సెలవు దినాలు రావడంతో భద్రాద్రి రామాలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి నిర్వహించే వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు ఆధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ మండపం రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలోనూ గోదా రంగనాథుల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

నేలకొండపల్లి: ధనుర్మాసం చివరిరోజు, భోగి పర్వదినాన నేలకొండపల్లిలోని అత్యంత పురాతనమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోదాదేవి-రంగనాథుల కల్యాణ్యాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ క్రతువును చిలకమర్రి స్వామినాధాచార్యులు నిర్వహించగా తూపురాణి మధుసూధనాచార్యులు, చిలకమర్రి శేఖర్‌ఆచార్యులు, కోవెల ఉదయ్‌కుమార్ ఆచార్యులు సహకరించారు.

ఖమ్మం ఖానాపురంహవేలి: ఖమ్మం నగరంలో గోదాదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా ధనుర్మాసంలో 30 రోజులపాటు సాగే ఆండాళ్ అమ్మవారి తిరుప్పావై పాశురాల పఠనం అనంతరం గోదాదేవి కల్యాణంతో ధనుర్మాస వ్రతం ముగుస్తుంది. నగరంలోని రంగనాయకుల గుట్టలోని లక్ష్మీరంగనాథస్వామిఆలయంలో, ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో, కమాన్‌బజార్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, ఖానాపురంహవేలి అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం, టేకులపల్లి గోశాలతోపాటు జిల్లాలోని పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముదిగొండ: మండలంలోని ముత్తారం రామాలయంలో గోదాదేవి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పూజార్లు బొర్రా వాసుదేవాచార్యులు కల్యాణం నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ పీఆర్వో జ్వాల నర్సింహారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో నారాయణచార్యులు పాల్గొన్నారు.

చింతకాని జనవరి 14: మండల కేంద్రంలోని శ్రీ భూనీల సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆలయంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి సీహెచ్ రామకోటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు, అర్చకులు వీ శ్రీనివాస్ ఆచార్యులు, గ్రామ పెద్దలు కిలారు మనోహర్‌బాబు, మల్లెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి మండలం జీళ్లచెరువు ఆలయంలో కల్యాణం



జీళ్లచెరువులో పాల్గొన్న భక్తులు



బూర్గంపాడులో...



ఖమ్మం ఖానాపురం అభయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో



నేలకొండపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో..



ఖమ్మం రంగనాయకుల గుట్టలో



చింతకానిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇష్టంలేని పెండ్లి .. యువతి ఆత్మహత్య

పాల్వంచ, జనవరి 14: తల్లిదండ్రులు ఇష్టంలేని వివాహం చేస్తారనే అనుమానంతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన మురుద పత్తి కొన్ని సంవత్సరాల క్రితం పాల్వంచ నవభారత్ ప్రాంతానికి వలస వచ్చి నవభారత్ కర్మాగారంలో తన కుమారుడితో కలసి పని చేస్తున్నాడు. అతని కుమార్తె స్వప్న(20) తన తండ్రికి, సోదరుడికి చేదోడు వాదోడుగా ఉండేది. రెండు నెలల క్రితం పత్తి తన స్వరాష్ట్రంలో తన కుమార్తెకు పెండ్లి సంబంధం చూశారు. ఈ విషయం తెలుసుకున్న స్వప్న మధ్యాహ్నం తన తండ్రి, సోదరుడు పనికి వెళ్లగానే ఇష్టంలేని పెళ్లి చేస్తారనే అనుమానంతో ఇంట్లో ఉరి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విధులనుంచి వచ్చిన తండ్రి, సోదరులు ఇంట్లోకి ప్రవేశించేసరికి ఉరి వేసుకుని స్వప్న మృతిచెంది ఉండటాన్ని వారు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పాల్వంచ టౌన్ పోలీసులు ప్రాథమిక విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

తండ్రి మందలించాడని యువకుడి బలవన్మరణం

గుండాల, జనవరి 14: అతిగా మద్యం సేవిస్తున్నావని ఓ తండ్రి తన కొడుకును మందలించడంతో మనస్తాపం చెంది ఉరివేసుకుని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గుండాల మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని తూరుబాక గ్రామానికి చెందిన కల్తి కృష్ణరావు(22) తరుచు మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులతో ఘర్షన పడుతుండేవాడు. శనివారం రాత్రి ఇంట్లో తండ్రి, కుటుంబ సభ్యులు మద్యం తాగవద్దని మందలించారు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలో పత్తి చేనులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి గుండాల పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చండ్రుగొండ, జనవరి 14: మండల పరిధిలోని సీతాయిగూడెం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నవెంకటి(45) మృతి చెందాడు. అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం గ్రామానికి చెందిన చిన్నవెంకటి సీతాయిగూడెం సమీపంలో పామాయిల్ తోటలో కాపల దారుడిగా పనిచేస్తున్నాడు. పని ముగిసిన అనంతరం స్వగ్రామం అబ్బుగూడేనికి బైక్‌పై వెళుతుండగా సీతాయిగూడెం శివారులో వాహనం అదుపుతప్పి బండరాయికి ఢీకొంది. ఈప్రమాదంలో చిన్నవెంకటి అక్కడికక్కడే మృతి చెందారు.

మరో ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దమ్మపేట, జనవరి 14 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన ప్రధాన రహదారి గట్టుగూడెం మూలమలుపు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన నాగుల పుల్లారావు, నాతి వెంకన్న ఇద్దరు కలిసి పని నిమిత్తం ద్విచక్రవాహనంపై సత్తుపల్లి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గట్టుగూడెం మూల మలుపు వద్ద అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వెళుతున్న లారీ వేగంగా వస్తూ అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది.

గంజాయిని వీడాల్సిందే

- భద్రాద్రి జిల్లా మీదుగా రాష్ట్రమంతటా రవాణా
- భారీగా పట్టుబడుతున్న మత్తు సరుకు
- యువతను కబలిస్తున్న మహమ్మారి

పాల్వంచ, జనవరి 14: రాష్ట్రంలో గంజాయి రవాణా, మత్తుపదార్థాల వినియోగం తదితర అంశాలపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ఇప్పుడు అందరి దృష్టి గంజాయిపై పడింది. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో పండించిన గంజాయిని స్మగ్లర్లు వివిధ రవాణా మార్గాల ద్వారా మన రాష్ట్రంలోకి తరలిస్తున్నారు. ఆ నాలుగు రాష్ట్రాల నుంచి సునాయాసంగా భద్రాచలం మీదుగా సాగే ఈ రవాణాపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

ఏటికేడు పెరుగుతున్న కేసులు

కేవలం 2023వ సంవత్సరంలోనే పోలీస్‌శాఖ కేవలం పాల్వంచ సర్కిల్ పరిధిలోనే జరిపిన దాడుల్లో మొత్తం 12 కేసులు నమోదు చేసి రూ.రెండు కోట్ల విలువ చేసే 1,202 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసున్నారు. 13మంది పై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు 2023లో మొత్తం 1,942 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని 84 కేసులు నమోదు చేశారు. 151 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్ర వచ్చిన తరువాత కేవలం భద్రాచలంలో 2022లో ఏఎస్పీగా ఉన్న రోహిత్‌రాజ్ ఆ ప్రాంతంలో పట్టుబడిన ఎండుగంజాయిని కోర్టు అనుమతితో దహనం చేశారు.

గంజాయి మత్తుకు యువత చిత్తు

గంజాయి రవాణాకు భద్రాది జిల్లా అడ్డాగా మారింది. అత్యధిక శాతం గంజాయి జిల్లాలోనే పట్టుబడుతుండటం, దళారులకు, వ్యాపారస్తులకు సునాయాసంగా గంజాయి లభిస్తుండటంతో సామాన్యుడికి నిత్యవసర వస్తువు తరహాలోనే దొరుకుతోంది. పల్లెల్లో సైతం యువత ఎండు గంజాయిని సిగరెట్లలో దూర్చి సేవించడం, గంజాయి పొడిని కూల్‌డ్రింక్ బాటిళ్లలో పోసి నిప్పంటించి ఆ పొగను, తద్వారా వచ్చే మత్తును ఆస్వాదిస్తున్నారు. మత్తు కొనుగోలుకు దొంగల్లా మారుతున్నారు.

పటిష్ఠ నిఘా అవసరం

గంజాయిని రవాణాను అరికట్టడానికి పోలీస్, ఎక్సైజ్ అధికారులు స్మగ్లింగ్‌ను అరికట్టడానికి కొత్త మార్గాలను అన్వేషించాలి. చిత్తశుద్ధితో భద్రాచలం చెక్‌పోస్ట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. 24 గంటల నిఘా ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలి. అవసరమైతే అధికారులను సిబ్బంది సంఖ్యను పెంచాలి.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు(ఫైల్)

కార్యదర్శులపై అదనపు భారం

- ప్రజాపాలన దరఖాస్తుల పునఃపరిశీలన
- త్వరగా పూర్తిచేయాలని అధికారుల ఆదేశం
- తప్పొప్పులను సరిచేయాల్సిందేనని హుకుం

ఎర్రుపాలెం జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులను డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆన్‌లైన్ చేయడం దాదాపుగా అయిపోయింది. జనవరి 12 కల్లా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జనవరి 5వ తేదీ నుంచే దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం మొదలుపెట్టారు. పంచాయతీల్లో గ్రామ సభల ద్వారా సేకరించిన దరఖాస్తులను నేరుగా ఉన్నది ఉన్నట్లుగా ఆపరేటర్లు ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇంతటితో ఆన్‌లైన్ ప్రక్రియ అయిపోతుందని అందరూ భావించారు, కానీ ఆన్‌లైన్ అయిన దరఖాస్తులను పున:పరిశీలించాలని, తప్పొప్పులను సరిచేయాలని ఆదేశించారు. అనుకున్న తేదీకల్లా తప్పులు లేకుండా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవ్వాలని ఆదేశించారు.

సెక్రటరీలకు పెరిగిన పనిభారం

గ్రామాల్లో గ్రామసభల ద్వారా అభయ హస్తం పథకాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా పంచాయతీ సెక్రటరీలు ఒక్కొక్క దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు దరఖాస్తు రసీదులను అందించారు. లబ్ధిదారులను ఆయా పథకాలు వర్తించే విధంగా విభాలుగా విభజించి ఆపరేటర్లకు అందజేశారు. డేటా ఎంట్రీ చేసే సందర్భంలో దొర్లిన తప్పులను, దరఖాస్తులో వచ్చిన తప్పులను మరలా సరిచేయాలంటూ పై అధికారులు ఆదేశాలివ్వడం చేసిన పనినే మరలా చేయటం సెక్రటరీలకు తలనొప్పిగా మారింది. ఒక్కొక్క గ్రామం నుంచి వందల్లో దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం కల్లా తప్పులు లేకుండా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవ్వాలని అధికారులు ఆదేశించారు.



దరఖాస్తుల్లో తప్పులు సవరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఆప్షన్లు లేవు

కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పర్యవేక్షణలో కంప్యూటర్ ఆపరేటర్లు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. అయితే ఆన్‌లైన్ చేసే సందర్భంలో డేటా సేవ్ చేయడానికి, ఎడిట్ చేయడానికి ఆప్షన్ లేకపోవడం వలన తప్పొప్పులను సరిచేయడం సెక్రటరీలకు సమస్యగా మారింది. వెబ్‌సైట్ పూర్తిగా తెలుగా మాధ్యమంలో పొందుపర్చారు. ఆపరేటర్లు ఇంగ్లీష్‌లో ఎంట్రీ చేస్తున్నారు. వెబ్‌సైట్‌కు ఆధార్ అనుసందానించకపోవడంతో ఒకవేళ ఆధార్ నెంబర్‌లో తప్పులు దొర్లినా అప్లికేషన్ ఎంట్రీ అవుతుంది. అలాకాకుండా ఆధార్ ఈకేవైసీ తో అనుసందానిస్తే తప్పులు దొర్లకుండా దరఖాస్తులను ఎంట్రీ చేయ్యచ్చు



డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

మళ్లీ క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాపాలన అభయ హస్తం పథకాలు అమలు చేసేందుకు అర్హులను ఎంపిక చేసేందుకు మరల గ్రామాల్లో ఇంటి ఇంటికి వెళ్లి పరిశీలన చేసి, నిర్దేశించిన సంక్షేమ పథకాలకు అర్హులను ధ్రువీకరించాల్సిన బాధ్యత సెక్రటరీలదే. చేసిన పనే మరలా మరలా చేయడంకన్నా ఒకేసారి వచ్చిన దరఖాస్తుల సంఖ్యనుబట్టి పంచాయతీలకు ఆపరేటర్లను కేటాయించనట్లైతే సులువుగా ఆన్‌లైన్ ప్రక్రియ తప్పులు దొర్లకుండా చేయొచ్చు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒకొక్క దరఖాస్తును ఆన్‌లైన్ చేసినందుకు రూ. 15వరకు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వందల సంఖ్యలో దరఖాస్తులను ఆన్‌లైన్‌చేస్తూ, వేలల్లో ముట్టచెప్తూ ఖర్చు చేస్తున్నా సెక్రటరీలకు పనిభారం మాత్రం తప్పట్లేదు.

ఛత్తీస్‌గఢ్ గ్రామాలపై పోలీసుల డ్రోన్ బాంబ్ దాడులు

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి సమత

చర్ల, జనవరి 14: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని పలు అటవీ గ్రామాలపై పోలీసులు డ్రోన్ బాంబ్ దాడులు చేశారని ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు పార్టీ సౌత్ సబ్‌జోనల్ అధికార ప్రతినిధి సమత ఆరోపించారు. ఈ ఘటనపై ఆదివారం ఛత్తీస్‌గఢ్ మీడియాకు ఆమె పేరుతో లేఖను విడుదల చేశారు. ఆ లేఖలో బీజాపూర్, సుకుమా జిల్లాల సరిహద్దు గ్రామాలైన మెట్టగూడ, ఎరన్‌పల్లి, బొటెతాంగ్ గ్రామాలపై ఈనెల 13తేదీన పోలీసులు డ్రోన్ బాంబ్ దాడులు చేశారని ఆరోపించారు. ఈ దాడులతో అనేక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారని తెలిపారు. ఈ ఘటనకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆ లేఖలో సమత పేర్కొన్నారు. అయితే ఈ ఘటనలో ఎవ్వరికైనా ప్రాణహాని జరిగిందా లేదా అనే విషయాన్ని సమత ఆ లేఖలో వివరించలేదు.

గాయపడిన యువకుడి మృతి

ఇల్లందుటౌన్, జనవరి 14: ఇల్లెందు పట్టణంలో పండగపూట విషాదం అలుముకుంది. పట్టణంలోని నిర్వాసిత కాలనీకి చెందిన మేకల రాజు (22) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే చికిత్స పొందుతున్న రాజు పరిస్థితి విషమంగా మారడంతో ఆదివారం మృతి చెందాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుంచి కోళ్ల తీసుకవచ్చేందుకు ఇల్లెందు నుంచి వెళ్లిన వాహనంలో రాజు సహాయకునిగా వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పెనుబల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గరుయ్యారు. తీవ్రంగా గాయపడిన రాజును ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. రెండు రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కోడిపందాల స్థావరంపై దాడి

దుమ్ముగూడెం, జనవరి 14: పక్కా సమాచారంతో పెదకమలాపురం గ్రామశివార్లలో కోడి పందాల స్థావరంపై ఎస్ఐ పడాల కేశవరావు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి కొందరు పందెపురాయుళ్లు పారిపోగా వెంబడించడంతో ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ2వేల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, రెండు కోడిపుంజులు, ఒక కోడి కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ ఢీ.. ఇద్దరికి గాయాలు

సత్తుపల్లిరూరల్, జనవరి14: ద్విచక్ర వాహనాన్ని ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో సోదరులకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం సత్తుపల్లి మండలంలోని తాళ్లమడ వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి మునిసిపాలిటీకి చెందిన ముత్తు సోయత్‌కుమార్ గుప్తా, ముత్తు ధన్విత్ గుప్తా మండలంలోని రామానగరంలోని తాతయ్య ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామం వస్తున్నారు. అదేసమయంలో అశ్వారావుపేట వైపు అమ్మోనియం లోడుతో వెళ్తున్న ట్యాంకర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రగాయాలైన సోదరులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ప్రమాద సమయంలో ఎదురుగా ఏమీ రాకపోవడం, సమీపంలో ఇళ్ల ముంగిట ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కుశకుమార్ తెలిపారు.



టేకులపల్లిలో భోగిమంట వేసిన గ్రామస్థులు



అశ్వారావుపేటలో భోగిపండ్లు



కొత్తగూడెంలో గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులు



కూసుమంచిలో డూ డూబసవన్న

సంక్రాంతులు

ఊరూవాడా సందళ్లు.. వీధుల్లో హరిదాసుల కీర్తనలు.. డూడు బసవన్నల విన్యాసాలు.. ఇళ్ల మంగిళ్లలో రంగవల్లులు.. పిండి వంటల ఘుమఘుమలు.. పిల్లలు, యువతుల కేరింతలతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ కనిపిస్తోంది. తెలుగు సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతీకగా నిలిచి, ప్రజలంతా సంతోషంగా పండుగను జరుపుకొంటున్నారు.



తల్లాడలో సంక్రాంతి ముగ్గు



అశ్వాపురం మండలం మొండికుంటలో ముగ్గుల పోటీ



ఖమ్మం నగరంలో భోగి మంటలు

భారత్ జోడో యాత్రకు
సంఘీభావ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి14: దేశ ప్రజల సమైక్యత కోసమే ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపడుతున్నారని, రాజకీయాలకు అతీతంగా ప్రజలు మద్దతు తెలపాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు సంఘీబావంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యం లో ఖమ్మంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ర్యాలీని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి జడ్పీలోని అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ జోడో న్యాయ్ యాత్ర ఉద్దేశ్యాలను దుర్గాప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ జావీద్, నాగండ్ల దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో కేంద్రమంత్రి
బీఎల్‌వర్మ పర్యటన ఇలా..

ఖమ్మం బైపాస్‌రోడ్, జనవరి14: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈశాన్యరాష్ట్రాల అభివృద్ధి, కోపరేటివ్‌శాఖ కేంద్రమంత్రి బీఎల్‌వర్మ నేటినుంచి మూడురోజులపాటు పర్యటించనున్నారు. నేడు ఉదయం 10-30గంటలకు ఖమ్మంరూరల్ మండలానికి చేరుకుంటారు. అనంతరం 2గంటలకు రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామంలో జరిగే వికసిత్‌భారత్ ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. 16వ తేదీ కొత్తగూడెం లో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి ఖమ్మం చేరుకుంటారు. 17వ తేదీ ఉదయం 8గంటలకు నగరం లోని రంగనాయకుల గుట్ట వద్ద రంగనాయకుల స్వామి ని దర్శనం చేసుకుని 9గంటలకు శ్రీశ్రీ హోటల్‌లో మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. 10గంటలకు బోనకల్ మండలం రావినూతలలో జరిగే వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం 2గంటలకు మధిర మండలం మల్లారంలో జరిగే వికసిత్ భారత్ అధికారిక కార్యక్రమంలో పాల్గొంటారు.

ఆలయ నిర్వహణకు నగదు వితరణ

బోనకల్, జనవరి 14: 'శంభులింగేశ్వరుడికి అష్ట కష్టాలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడం పాఠకులకు తెలిసిందే. దీనికి స్పందించిన ఖమ్మం నగరానికి చెందిన గండ్ర దుర్గా ప్రసాద్ ఆది వారం దేవాలయానికి వచ్చి ధూప, దీప నైవేద్యాలకు రూ. 10వేల నగదును అందజేశారు. మరి కొంతమంది దేవాలయాన్ని సందర్శించి తమ వంతుగా సహాయం చేస్తామని తెలిపారు. శంభులింగేశ్వరుడి అష్టకష్టాలను కళ్లకు కట్టినట్లుగా ప్రచురించినందుకు గానూ భక్తులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.





జీరోటిల్లేజీ విధానంలో సాగుచేసిన మొక్కజొన్న పంట

లాభాలు తెచ్చే.. జీరోటిల్లేజీ

- మొక్కజొన్న సాగులో కొత్త విధానం
- వానాకాలం వరి కోశాక నేరుగా విత్తుతున్న రైతులు
- ఎకరానికి 40క్వింటాళ్ల మేర దిగుబడి

వేంసూరు, జనవరి 14: వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో జీరోటిల్లేజీ పద్ధతిలో రైతులు మొక్కజొన్న సాగుచేపట్టారు. వానాకాలం వరికోతలు పూర్తయిన వెంటనే రైతులు యాసంగిలో జీరోటిల్లేజీ పద్ధతిలో భూమిని మళ్లీ దున్నకుండా ఆపొలంలోనే మొక్కజొన్న విత్తనాలు విత్తి సాగుచేస్తున్నారు. దీంతో దుక్కి, బోదెలు తోలటం, నీటి తడుల ఖర్చు తగ్గుతుంది. మండలంలో వేంసూరు, లింగపాలెం, మర్లపాడు, లచ్చన్నగూడెం, వెంకటాపురం, రాయుడుపాలెం గ్రామాల్లో సుమారు 1500ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేపట్టారు. మండలంలో గత పదేళ్ల నుంచి ఈ విధానంలోనే రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. దీంతో ఎకరాకు 40క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం క్వింటా మొక్కజొన్న ధర రూ.2300 ఉంది. వానాకాలంలో కొంతమంది రైతులు ముందుగానే వరికోసి ఆతర్వాత మొక్కజొన్న విత్తనాలు విత్తారు. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మరికొంతమంది ఆలస్యంగా మొక్కజొన్న పంటలను సాగుచేశారు. దీంతో పలు గ్రామాల్లోని రైతులు జీరోటిల్లేజీ విధానంలో మొక్కజొన్న పంటను సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న పంట లాభదాయకంగా ఉన్నప్పటికీ కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో కాపలా ఖర్చు అధికమవుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

జీరోటిల్లేజీతో ఖర్చు తగ్గుతుంది
గోదా నరేష్, రైతు, వేంసూరు



తనకున్న రెండెకరాలతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశాను. జీరోటిల్లేజీ విధానంతో తక్కువ ఖర్చు అవుతుంది. అందువలనే తమ గ్రామంలోని రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు.

ఎకరాకు 40క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది
అచ్చెన కృష్ణయ్య, రైతు, మర్లపాడు



తమకున్న ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. గత పదేళ్ల నుంచి జీరోటిల్లేజీ విధానంలోనే తాము మొక్కజొన్న పంట సాగుచేస్తున్నాము. ఎకరాకు 40క్వింటాళ్ల కుపైగా దిగుబడి రావడంతోపాటు ప్రస్తుతం మార్కెట్లో క్వింటా రూ.2300ధర పలుకుతుంది. కోతుల నుంచి తమ పంటను కాపాడుకోవడం కష్టంగా ఉంది.

రైతులకు జరిగిన నష్టాన్ని ఆయిల్‌ఫెడ్ ఎండీ దృష్టికి తీసుకెళ్తా

- ఆయిల్‌ఫామ్ రాష్ట్ర కన్సల్టెంట్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి



పామాయిల్ తోటను పరిశీలిస్తున్న రాజశేఖరరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సత్తుపల్లి, జనవరి14: సత్తుపల్లి మండలంలో నష్టపోయిన పామాయిల్ రైతుల సమస్యలు, జరిగిన నష్టాన్ని ఆయిల్‌ఫెడ్ ఎండీ దృష్టికి తీసుకెళ్తానని ఆయిల్‌ఫామ్ రాష్ట్ర కన్సల్టెంట్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపురంలో పామాయిల్ తోటలను ఆదివారం ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకరరెడ్డి ఆదేశాల మేరకు రైతులతో కలిసి సందర్శిం చారు. ఈ సందర్భంగా సుమారు 100 మొక్కలను పరిశీలించి వాటిపై పురుగులు ఉండటాన్ని గమనించారు. అదేవిధంగా చనిపోయిన, కాపుకు రాని పామాయిల్ మొక్కలను చూశారు. ఆరేళ్లుగా ఎదుగుదల లేని విషయం, కాపు, చనిపోయిన మొక్కల పూర్తి వివరాలను బాధిత రైతులు పుచ్చకాయల సోమిరెడ్డి, రమేష్‌రెడ్డిలు వివరించారు. ప్రాథమికంగా సుమారు రూ.48లక్షల మేర నష్టం జరిగి ఉండవచ్చునని ప్రాథమి కంగా అంచానాకు రాగా రైతులు, పామాయిల్ మొక్కల సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్తానని రైతులకు రాజశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఫీల్డ్ అధికారులు అప్పారావు, కృష్ణారావు, సతీష్ రైతులు ఉన్నారు.

సమన్వయ లోపం.. కాలువ పనులకు శాపం

మణుగూరుటౌన్, జనవరి 14: మణుగూరు పట్టణంలోని టీడీపీ సెంటర్ నుంచి కోడిపుంజుల వాగు వరకు ప్రధాన రహదారి విస్తరణ, ప్రధాన కాలువ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులకు, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు నడుమ సమన్వయ లోపమే ఇందుకు కారణమే విమర్శలు వస్తున్నాయి. వర్షాకాలంలో ప్రస్తుతం కాంట్రాక్టర్ నిర్మిస్తున్న ప్రధాన కాలువ కోడిపుంజుల వాగు వరద ఉధృతికి ఎదురుగా నిర్మిస్తున్నారని, వరద తాకిడికి వరద నీరు పోటెత్తి అశోక్‌నగర్ ప్రాంతంతో పాటు ప్రధాన రహదారి జలమయ మవుతుందని స్థానిక ప్రజలు ఆందోళను చెందుతున్నారు.



అష్టవంకరులుగా తిరిగిన ప్రధాన కాలువ

- అష్టవంకరలతో ప్రధాన కాలువ పనులు
- రూ.2.60 కోట్ల సొమ్ము దుర్వినియోగం
- వరద నీరు పోటెత్తుందని స్థానికుల ఆందోళన

అశోక్‌నగర్ టెలిఫోన్ ఎక్ఛేంజ్ కార్యాలయం నుంచి కోడిపుంజుల వాగువరకు కొనసాగుతున్న కాలువ నిర్మాణ పనులపై విమర్శలు వస్తున్నాయి. కోడిపుంజుల వాగుపై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జీని ఆనుకుని రోడ్డు విస్తరణలో భాగంగా మరో బ్రిడ్జీని నిర్మించాలన్న ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనలకు ఈ కాలువ నిర్మాణం పెద్ద అడ్డంకిగా మారనుంది. మరో బ్రిడ్జి నిర్మిస్తే ఈ కాలువ వంతెన మధ్యలోకి వస్తుందని, తద్వారా పలు ఇబ్బందులు భవిష్యత్‌లో ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. అదికాకా కాలువ ముప్పైమూడు వంకరలు అన్నట్లుగా నిర్మాణం చేపడతున్నారని విమర్శిస్తున్నారు.

రూ.2.6 కోట్లతో శంకుస్థాపన

పట్టణంలోని టీడీపీ సెంటర్ నుంచి అశోక్‌నగర్ కోడిపుంజుల వాగు వరకు ప్రధాన రహదారి విస్తరణతో పాటు ప్రధాన కాలువ నిర్మాణానికి రూ.2.60 కోట్ల అంచన నిధులతో 2023 మే 13న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతరావు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి నేటి వరకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవ్వరు ఈ పనులను పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ నిదానంగా ఇష్టాను సారంగా నిర్మాణ పనులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.కోట్ల నిధులతో చేపడుతున్న ఈ పనులు వర్షాకాలంలో అశోక్‌నగర్ వాసులకు ఇబ్బందిగా మారుతుందని పలువురు వాపోతున్నా కాంట్రాక్టర్ పట్టించు కోవడంలేదన్న ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైన అధికా రులు దృష్టిసారించి భవిష్యత్‌లో బ్రిడ్జీ విస్తరణను దృష్టిలో ఉంచుకుని పనులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



వంతెన కిందకు మలుపు తిప్పి నిర్మిస్తున్న ప్రధాన కాలువ

ఉత్తిపోతల పథకాలు

- వాగులు, ఒర్రెలు ఉన్నా సాగునీరు సున్నా
- ఆళ్లపల్లి మండల రైతుల కంట కన్నీరు
- నీటి కోసం శతవిధాల ప్రయత్నాలు
- వేల ఎకరాల్లో ఆకాశాపాయ పొలాలు

ఆళ్లపల్లి, జనవరి 14: ఏజెన్సీ ప్రాంతమైన ఆళ్లపల్లి మండలంలోని గిరిజనులు ఎన్నో ఆశలతో నాగలి పట్టి ఆరుగాలం కష్టపడిన పంట సాగు చేస్తే చివరి తడికి నీళ్ల లేక ప్రతి ఏట రైతు కళ్లలో కన్నీటి సుడులు తీరుగుతున్నాయి. ఎండిపోయిన పంట ముందు రైతన్న మొహం చిన్నబోతుంది. కిన్నెరసాని, జల్లెరు, కోడేలవాడు, పాలవాగు, ఎర్రకుంట ఒర్రె, ఇంకా చిన్న చిన్న ఒర్రెలు అనేకం ఉన్నపట్టికి, వాటిపై ఎత్తిపోతల పథకాలు ఉన్నా, మోటర్లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది.

నిరుపయోగంగా రూ.11 కోట్ల ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకం

ఆళ్లపల్లి మండలం, మైలారం గ్రామం వద్ద కిన్నెరసాని వాగుపై రూ.11 కోట్లతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం, సూమారు 1000 ఎకరాలకు పైగా పంటకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో నిర్మించారు. 2019లో అందుబాటులోకి వచ్చిన ఈ లిఫ్ట్ ద్వారా ఆళ్లపల్లిలో మొద్దుల చెరువు, ఎర్రచెరువు, పాలకుంట, దులకుంటతో పాటు మరికొన్ని చెరువులకు నీరు అందించి, వాటి ద్వారా పంటకు నీరు అందించటంతోపాటు దగ్గరగా ఉన్న భూములకు పైపుల ద్వారా నీరు అందించాలి, కాని ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఇంజనీరింగ్ అధికారులు కిన్నెరసానివాగు పొంగే ప్రవాహం, మోటర్లు ఎంతఎత్తులో ఉండాలి, విద్యుత్ లైన్ ఏర్పాటు, బావుల నిర్మాణాలు, ఇలా ప్రతీది వరద ప్రవాహన్ని అంచనవేసి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల సలహాలతో నిర్మిస్తే ఉపయోగంగా ఉండేది, కాని ఇంజనీరింగ్ అధికారులు వరదను అంచనవేయకుండా నిర్మించడంతో, ప్రతి ఏడాది కిన్నెరసాని వరదలకు, బావులు, విద్యుత్ ట్రాన్స్‌ఫర్, మోటర్లు ఉన్నగది, అందులో మోటర్లు, ఇతర విద్యుత్ పరికరాలు పూర్తిగా నీటిలో మునిగి, తడిచి, మరమత్తులకు గురిఅవుతున్నాయి.



చెక్‌డ్యాం లేకపోవడంతో కిన్నెరసాని నీళ్లకు బస్తాలతో కట్టకడుతున్న ఆళ్లపల్లి రైతులు(ఫైల్)

పనిచేయని లిఫ్ట్ పథకాలు

మర్కోడు పంచాయతీ, జిన్నెలగూడెం వద్ద, జల్లెరు వాగు పై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నిరుపయోగంగానే ఉంది. ఆయ ఎత్తిపోతలకు నీరు అందించడం, భూర్భజలాలు పెంచాలన్న లక్ష్యంతో మూడేళ్ల క్రితం అక్కడ ఉన్న లిఫ్ట్ బావిని పూడ్చి, రూ. 1.30 లక్షలతో చెక్‌డ్యాం నిర్మించి గాలికి వదిలేశారు. మర్కోడు గ్రామంలో జల్లేరుపై ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ మోటర్లను మూడేళ్లుగా కనిపించడం లేదు. దాంతో 25 ఏకరాలు బీడు భూములుగా ఉన్నాయి. దానిపై ఆంధ్రజ్యోతి అధికారులను ప్రశ్నించగా పొంతనలేని సమాదానం ఇస్తున్నారు. రామానుజగూడెం, వద్ద ఎత్తిపోతలు పట్టించుకున్న దాఖాలు లేవు. ఆళ్లపల్లిలో కస్తూర్బి పక్కన అలుగు ఒర్రెపై ఉన్న లిఫ్ట్ ములనపడింది. దాంతో అక్కడ కూడా ప్రతి ఏడాది వర్షధారంపై పంట పండాల్సిందే. అనంతోగు వద్ద కిన్నెరసానిపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం వరదలు రావడంతో మోటర్లు, తడిచి, మరమ్మత్తులకు గురైనవి. అధికారులు వరదలను అంచనవేయకుండానే లిఫ్టులు ఏర్పాటు చేయడంతో, కొన్ని సంవత్సరాల నుంచి ఏటేటా వరదలకు మోటర్లు, విద్యుత్ పరికరాలు నీట మునుగడం, పైపులు కొట్టుకపోతున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆళ్లపల్లి మండలంలో ఉన్న ఎత్తిపోతల పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

పాయం హామీపై హర్షం

ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పినపాక నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆళ్లపల్లి మండల ప్రచారంలో భాగంగా, రైతులను ఉద్దేశించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అనంతోగు లిఫ్ట్ అభివృద్ధి చేసి దాని ద్వారా రాయిపాడు వరకు భూములకు నీరందించి, బీడు భూములను సశ్యశామలం చేస్తానని హామీ ఇచ్చారు. దాంతో పాటు మర్కోడు గ్రామంలోని రేగడి చెరువు కింద రెండు పంటలు పండేలా పునరుద్దరన పనులకు, త్రీఫేస్ కరెంట్ సౌకర్యం ఏర్పాటుకు కృషి చేసి, ఆళ్లపల్లి మండలంలో పంటను సస్యశ్యామలం చేస్తామని హామీలు ఇవ్వగా, ప్రస్తుతం పాయం వెంకటేశ్వర్లు అధికారంలోకి రావడంతో ఆళ్లపల్లి మండల రైతులు ఈ సారైనా మా కష్టాలు తీరుతాయని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



కనిపించకుండా పోయిన లిఫ్ట్ మోటర్ల స్టాండ్



నీట మునిగిన ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకం



జల్లెరువాగుపై ఆయిల్‌ఇంజన్



రాజమహేంద్రవరం, ఖమ్మం జట్ల మ్యాచ్

హోరాహోరీగా ఆలిండియా
బాస్కెట్ బాల్ పోటీలు

- సెమీఫైనల్‌కు చేరిన ఖమ్మం జట్టు
- రాజమహేంద్రవరం క్రీడాకారులపై విజయం

రామచంద్రపురం, జనవరి 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 13వ ఆలిండియా, 19వ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ సెమీ ఫైనల్స్ పోటీలు ఆదివారం పోటాపోటీగా జరిగాయి. ఈపోటీల్లో సెయింట్స్ జట్టుపై గుంటూరు జట్టు, అనంతపురం జట్టుపై బీఎస్‌ఏ కాకినాడ జట్టు, వైజాగ్ జట్టుపై మార్టేరు జట్టు విజయం సాధించాయి. రాజమహేంద్రవరం సీబీఏ జట్టుపై ఖమ్మం జట్టు, అమలాపురం జట్టుపై రామచంద్రపురం జట్టు, రాజమహేంద్రవరం సీబీఏ జట్టుపై హైదరాబాద్ డీబీఏ జట్టు, గుంటూరు జట్టుపై ఆక్టేరి జట్టు గెలుపొందాయి. సోమవారం ఫైనల్స్ పోటీలు జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖ డాక్టర్ చెలికాని స్టాలిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

కొత్తగూడెం, జనవరి 14: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రియాంక అల ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రభుత్వ సెలవు కావడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సెలవు కావడంతో అధికారులు అందుబాటులో ఉండని కారణంగా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ కోరారు.

వైభవంగా భోగి వేడుకలు

ఉత్సాహంగా భోగి మంటలు.. చిన్నారులకు పండ్లు

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్, జనవరి 14: భోగి పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. ఆనందోత్సాహాల మధ్య భోగి మంటలు వేయడంతోపాటు.. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. అశ్వారావుపేట మండలంలో అత్యంత వైభవంగ జరుపుకున్నారు. తెల్లవారుఝామున ప్రతి గ్రామంలో భోగి మంటలు వేసి సందడి చేసారు. మండలంలోని దిబ్బగూడెం బిర్రం వెంకటేశ్వర రావు అధ్వర్యంలో తన మనవడు, మనవరాలు పేరుతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో తెల్లవారుఝామునే అమ్మవారి అభిషేకం కోసం శంఖుతీర్థాన్ని మేళతాళాలతో వెళ్ళి తెచ్చారు. గోపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలతో భోగిమంటలు వేసారు. మహిళలు వాకిళ్లను రంగవల్లులతో నింపివేసారు.

సంస్కృతి, సంప్రదాయాల మేళవింపే సంక్రాంతి

కొత్తగూడెం: సంస్కృతి, సంప్రదాయాల మేళవింపే సంక్రాంతి పండుగ పర్వదినమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని పాత కొత్తగూడెంలో యువజన సమాఖ్య నాయకుడు నిమ్మగడ్డ వికాస్ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ప్రస్తుతం అంతరించిపోతున్న సంప్రదాయాలను గుర్తు చేసి వాటిని భావితరాలకు అందించేందుకు పండుగలు దోహదపడతాయన్నారు.

ఆళ్లపల్లి/గుండాలలో..

ఆళ్లపల్లి/గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లోని పల్లెల్లో భోగి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే మహిళలు ఇంటిముందు రంగవళ్లలను వేశారు. భోగిమంటలు వేసుకుని సందడి చేశారు. పిల్లలకు భోగిపళ్లు, పూలు వేసి వేడుకలు నిర్వహించారు.

ముగ్గుల పోటీలు

అశ్వాపురం: భోగిపండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని మొండికుంటలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొని రంగవల్లులు వేశారు. ముగ్గుల పోటీలకు అశ్వాపురం ఎస్ఐ సురేష్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, క్రీడాకారిణి చంద్రకళ, నెల్లిపాక ఎంపీటీసీ గాదె జయ, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉపేందర్, క్రిష్ణమాచారి, శ్రీనివాసరెడ్డి,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులందజేసిన ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కుంకుడు చెట్ల గుంపు ఏరియాలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్ధేశించి మాట్లాడారు. ఈ ప్రాంతానికి సంబంధించి ఏ సమస్యలున్న తన దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి కృషి చేసి మీకు అండగా నిలుస్తానని హామినిచ్చారు. అనంతరం ముగ్గుల పోటీ విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు స్థానిక మహిళలు పూలబొకే అందజేసి ఆహ్వానించారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవీ రావు, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, బాబ్‌జానీ పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండలంలో ఆదివారం భోగి సంబురాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు వేకువజామున లేచి భోగిమంటలు వేశారు. ఇళ్ల ముందు ముగ్గులు వేశారు. ఇళ్ల ముందు భోగిమంటలు కాలుస్తూ సంబురాలు నిర్వహించారు.

ఇల్లెందులో..

ఇల్లెందురూరల్: భోగి సందర్భంగా ముగ్గులు వేస్తు మహిళాలు సందడి చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కొల్లాపురం, ఒడ్డుగూడెం, కొమరారం, మర్రిగూడెం గ్రామాల్లో వాలీబాల్, కబడ్డీ, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రాఘబొయినగూడెం పంచాయతీలో మహిళాలకు ముగ్గులు, తాడుగుంజుడు, మ్యూజికల్ చైర్, కల్చరల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చంద్రుగొండలో..

చంద్రుగొండ: మండలంలో ఆదివారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే యువతి, మహిళలు ఇట్టి ముంగిట ముగ్గులువేసి రంగులు అలంకరించారు. కుటుంబసభ్యులు, బంధువులు కలిసి భోగి మంటలు వేసి ఆటపాటలతో అలరించారు. అదేవిధంగా చిన్నారుల చేత పూజలు చేయించి తలపై భోగి పళ్లు పోశారు.

వైభవంగా గోదారంగనాథ స్వామి కల్యాణం

దమ్మపేట: స్థానిక సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో గోదా రంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: ఆదివారం మండల ప్రజలు ఆనందంగా భోగి పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించారు. భట్టుపల్లి పంచాయితీలో భోగి మంటలను వెలిగించారు.


దమ్మపేటలో గోదా రంగనాథుల కల్యాణం


ఇల్లెందులో వాలీబాల్ పోటీ దృశ్యం


కరకగూడెంలో భోగిమంట వేస్తున్న దృశ్యం


గుండాలలో భోగి పండ్లు పోస్తున్న దృశ్యం


పాయానికి పుష్పగుచ్చం అందజేస్తున్న మహిళలు


బహుమతిని అందజేస్తున్న కూనంనేని


ఆళ్లపల్లిలో చిన్నారులకు భోగి పండ్లు

అపరిచితుల సమాచారం ఇవ్వండి: సీఐ

జూలూరుపాడు, జనవరి 14: గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరించినా కొత్త వాహనాలు కనిపించినా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని జూలూరుపాడు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జూలూరుపాడులోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పండుగకు ఇళ్లు విడిచి వెళ్లే వారు తాళాలు వేసి సమాచారం ఇచ్చి వెళ్లాలని కోరారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో వ్యాపారులు మాంజాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాంజాలు వాడటం సరికాదని ఆయన పేర్కొన్నారు. కోడిపందాలు, పేకాట ఆడితే ఉపేక్షించేది లేదన్నారు. లారీలు, ట్రాక్టర్లు, ట్రాలీ వాహనదారులు, పండుగకు కార్లలో ఊర్లకు వెళ్లే వారు తమ వాహనాలను రహదారులపై నిలపవద్దని, పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. ట్రాక్టర్ల యజమానులు వాహనాలకు రేడియం స్టిక్కర్లు వేసుకోవాలని సూచించారు.

కూనంనేని సంక్రాంతి శుభాకాంక్షలు



కొత్తగూడెం, జనవరి 14: ఈ సంక్రాంతి ప్రజల జీవితాల్లో నూతన ఉత్సాహాన్ని నింపాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికి ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ధాన్యం ఇంటికి చేరిన సమయం, బంధుమిత్రులతో, పశుపక్షాదులతో సంతోషంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. రాష్ట్రంలో ఉన్న పేద, బడుగు, అట్టడుగు వర్గాల సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ప్రస్తుత ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందరి ముంగిళ్లలో సంక్రాంతి శోభా వెల్లివిరియాలని, సంక్రాంతి అందరికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కలెక్టర్ శుభాకాంక్షలు..



జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రియాంక అల సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు భోగ, భాగ్యాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి ప్రతి కుటుంబంలో నూతన కాంతులు నింపాలని, ఇంటిల్లిపాది పండుగను ఎంతో ఆనందంగా సంతోషంగా జరుపుకోవాలని ఆమె కోరారు.

ముత్తయ్య కుటుంబానికి వితరణ

మణుగూరుటౌన్, జనవరి 14: మండల పరిధిలోని సమితిసింగారం గ్రామ పంచాయతీ గుండి వారి గుంపు ప్రాంతంలో అనారోగ్యంతో మృతి చెందిన మట్ట ముత్తయ్య దహన ఖర్చుల నిమిత్తం కుటుంబానికి మేము సైతం మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం రూ.3 వేలు వితరణగా అందజేశారు. పేదకుటుంబానికి ముత్తయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. మృతి చెందాడు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రంగా శ్రీనివాస్, మంగి మల్లి ఖార్జున్, మార్తి శ్రీనివాస్, ట్రస్ట్ అంబులెన్స్ డ్రైవర్ ప్రదీప్, గ్రామ పెద్దలు కనతి ప్రవీణ్, వర్స విజయ్, మట్ట వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుడి కల్యాణం

కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 14: పద్మావతి గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం ఆదివారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని వేంకటేశ్వరుడి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణ క్రతువును ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణంలో భాగంగా శ్రీవారి సారే ఉత్సవం, మాలోత్సవంను వేడుకగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించిన భక్తజనం భక్తి పార్వశ్యంతో తన్మయత్వం చెందారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాష, నిర్వాహకులు పీవీ వర్ధన్‌రావు, చిగురుపాటి శ్రీనివాస్, గోల్లపూడి శ్యాంసుందర్, వాసిరెడ్డి మురళి, వాసిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న కూనంనేని

పాల్వంచలో కాంగ్రెస్ ర్యాలీ

పాల్వంచ, జనవరి 14 : రాహుల్‌గాంధీ తలపెట్టిన భారత్ న్యాయ జోడో యాత్రకు మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులు సంఘీభావ ర్యాలీని పాల్వంచలో ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ ర్యాలీకి భద్రాద్రి జిల్లా సీపీఐ నాయకులు సైతం జిల్లా అధ్యక్షుడు సాబీర్ పాషా ఆద్వర్యంలో తమ సంఘీభావాన్ని ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. బస్టాండ్ ప్రాంతంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి ర్యాలీని ప్రారంభించి అంబేద్కర్ సెంటర్ వద్ద ముగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సమస్యలు, సామాజిక అసమానతలు నిర్మూలించి అందరికీ న్యాయం లభించాలనే దిశగా రాహుల్‌గాంధీ చేపట్టిన ఈ యాత్ర కాంగ్రెస్ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలీల్, గంగాధరరావు, మురళి, రాంబాబు, సోమయ్య, సాంబయ్య, గౌస్, జావేద్, సీపీఐ నాయకులు పూర్ణచంద్రరావు, రాహుల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.